నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
బుధవారం | జులై 17, 2024 | www.navatelangana.com

పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలి

జైపూర్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మండల పరిధిలో అర్హులందరికి అందేలా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణగౌడ్‌ను కోరారు. గతంలో విలేజ్ డెవలప్‌మెంట్ అధికారిగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం ఎంపీడీఓగా సేవలు గుర్తు చేస్తూ మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. వీడీఓగా మండల ప్రజలకు సుపరిచితుడైన సత్యనారాయణ ఎంపీడీఓగా మండలానికి రావడం సంతోషంగా ఉందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రామగిరి రాము, ప్రధాన కార్యదర్శి నిట్టూరి ప్రశాంత్, ప్రచార కార్యదర్శి తుంగపిండి మల్లేష్, వేల్పుల శివ అన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో బడిబాట

మందమర్రి : ఆదిల్‌పేట అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఎంపిడిఓ ఎస్.రాజేశ్వర్ హాజరై మాట్లాడారు. గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. 0-5 సంవత్సరం పిల్లలందరినీ ప్రీస్కూల్ అంగన్వాడీ సెంటర్‌కు పంపించాలని సూచించారు. మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక భేటీ బచావ్- భేటీ పడావ్, గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చట్టం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్యవివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ 1930, సఖి సర్వీసెస్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోక్సో యాక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ నెంబర్ 112 తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ సంధ్యారాణి, అంగన్వాడీ టీచర్ నాగరాణి, మహిళలు పాల్గొన్నారు.



రెన్యువల్ చేసుకోలేని రైతుల సంగతేంటి..?

- ప్రభుత్వ రుణమాఫీ మార్గదర్శకాలతో రైతుల్లో ఆందోళన
- ఆర్థిక ఇబ్బందులతోనే రెన్యువల్‌కు దూరం

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మార్గదర్శకాలతో రైతుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పదేండ్లు, ఐదేండ్ల కిందట పంట రుణాలు తీసుకొని చాలా మంది రైతులు రుణమాఫీ అవుతుందని రుణాలు చెల్లించలేదు. రెన్యువల్ కూడా చేసుకోలేదు. తాజాగా ప్రభుత్వం రుణమాఫీకి కటాఫ్ తేదీలో పంట రుణం తీసుకొని లేదా రెన్యువల్ చేసుకొని ఉంటేనే రుణమాఫీ వర్తిస్తుందని పేర్కొంది. అయితే చాలా మంది పంట రుణం తీసుకున్న తర్వాత రెన్యువల్ చేసుకోకుండా ఉన్నారు. వారు రుణమాఫీకి అర్హులు కారా?అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ధరణి పోర్టల్ పుణ్యమా అని...

పంట సాగులో పెట్టుబడులకు సరిపోక, ధరణి పోర్టల్ పుణ్యమా అని వ్యవసాయ భూముల విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు ఏర్పడి పంట రుణాలు రెన్యువల్ చేసుకోలేని రైతులు చాలా మంది ఉన్నట్టు తెలుస్తోంది. ఎకరాల్లో తేడా ఉండటంతో పాటు సరి చేయాల్సిన అధికారులు నిస్సహాయత వ్యక్తం చేసిన కారణంగా పంట రుణాలు రెన్యువల్ చేసుకోలేకపోయారు. ధరణి పోర్టల్‌లో ఏర్పడిన హెచ్చుతగ్గుల కారణంగా రెన్యువల్ చేసుకోలేని వారిలో నూటికి 90 శాతం మంది ఉంటారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో రెన్యువల్ చేసుకోలేని నిస్సాయ రైతుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురుచూస్తున్నారు. 20, 30 సంవత్సరాలుగా పంట రుణాలు తీసుకోవడం తిరిగి చెల్లించడం జరుగుతుండగా ధరణి పోర్టల్ తీసుకొచ్చినప్పట్నుండి విధిలేని పరిస్థితుల్లో రెన్యువల్ చేసుకోలేకపోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

కాంగ్రెస్ హామీ మేరకు రూ.2లక్షల పంట రుణాల మాఫీకి ముందుకొచ్చింది. దానికి సంబంధించి జీఓను సైతం విడుదల చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాలతో కొంత మంది రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటి వరకు పంట రుణం తీసుకున్న ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అవుతుందని భావించగా ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలతో కొంత సందిగ్ధత నెలకొంది. రాజకీయ నాయకులు, ఆదాయ పన్ను కడుతున్న వారు, ఆదాయ పన్ను కట్టిన ప్రభుత్వ ఉద్యోగులు, రీషెడ్యూల్ చేసుకున్న వారు అనర్హులంటూ వెల్లడించడంతో అలాంటి వారిలో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా రెన్యువల్ చేసుకోలేని వారికి రుణమాఫీ వర్తిస్తుందా? లేదా? అనేది చాలా మంది రైతుల్లో సందేహం నెలకొంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలా మంది రైతులు రుణం తీసుకొని ఇప్పటి వరకు రెన్యువల్ చేసుకోలేదు.



పదేండ్లుగా ఊరిస్తున్న రుణమాఫీ

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి రైతులను రుణమాఫీ ఊరిస్తూ వస్తోంది. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం నాలుగు విడతల్లో పూర్తి చేస్తామని చెప్పింది. మొదటి విడతలో రూ.25వేలు, రెండో విడతలో రూ.50వేలు, మూడో విడతలో రూ.75 ముక్కుతూ మూలుగుతూ ఈడ్చుకొచ్చింది. నాల్గవ విడత రూ.లక్ష రుణమాఫీ పొందిన వారిని క్షేత్రస్థాయిలో గుర్తించాల్సి వస్తోంది. పదేండ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించింది. అందుకు తగ్గట్టుగా ఆగస్టు 15లోపు రైతులను రుణ విముక్తులను చేసేందుకు కసరత్తు చేస్తోంది. పంట రుణం పొందిన ప్రతి ఒక్కరి రుణం మాఫీ అవుతుందని భరోసా ఉండేది. రీషెడ్యూల్ చేయించుకున్న రైతులు రుణమాఫీకి అనర్హులని ప్రకటించడంతో పదేండ్లుగా ఊరించిన రుణమాఫీకి వారు దూరమవుతున్నారు.

రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించక డిఫాల్టర్లుగా ముద్రపడ్డ రైతులందరు కూడా మారుమూల ప్రాంతాలకు చెందిన చిన్న సన్నకారు రైతులే. వ్యవసాయం తప్ప మరో మార్గం లేక పంటలు సాగు చేసుకుంటూ పెట్టుబడుల కోసం బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులు డిఫాల్టర్లుగా మిగిలిపోవాల్సి వచ్చింది. అయినప్పటికీ బ్యాంకు అధికారుల సమ్మతితో తీసుకున్న రుణం తిరిగి చెల్లించి రుణాలను రీషెడ్యూల్ చేయించుకున్న తీరు రుణమాఫీకి అడ్డంకిగా మారిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా డిపాల్టర్లుగా ముద్రపడ్డ రైతుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని అభ్యర్థిస్తున్నారు. అంతేకాకుండా ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా రెన్యువల్ చేసుకోని రైతుల పంట రుణాలు కూడా మాఫీ చేసేలా ప్రభుత్వం ముందుకు రావాలని పలువురు రైతులు కోరుతున్నారు.

యాజమాన్య నిర్లక్ష్యంతోనే అనుమతులకు జాప్యం

- ఎస్‌కెఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనికి అనుమతులు లేవని అటవీ అధికారులు మూసి వేయడానికి సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు అన్నారు. మంగళవారం ఆర్కే 7 గనిపై కస్తూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్, నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అటవీ శాఖ అనుమతులు తీసుకోకుండా గని మూసివేయడానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఈ విషయంలో సంబంధిత అధికారులతో మాట్లాడి అనుమతులు తీసుకొని, కార్మికుల్లో భయాందోళనలను తొలగించాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటాదారులుగా ఉండి కూడా నడిచే భూగర్భ గనికి అనుమతులు రాకపోవడం చూస్తే గనిని నిర్వీర్యం చేసే విధంగా కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. పర్యావరణం కొరకు సింగరేణి అనేక ప్రాంతాల్లో చెట్లు నాటడం చేస్తుందని, కానీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా మొండిగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. కేవలం పైరవీల కోసం రాజకీయ జోక్యాన్ని తీసుకొచ్చే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అనుమతుల విషయమై స్పందించకపోవడం సరైంది కాదని, వెంటనే స్పందించి అనుమతులు తెప్పించి కార్మికులకు భరోసా కల్పించాలని పేర్కొన్నారు. సింగరేణికి రావాల్సిన బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు(సీఐటీయూ) దూలం శ్రీనివాస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్కే 7 ఫిట్ సెక్రెటరీ ఎం.శ్రీధర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సమ్మయ్య, నవీన్, నరేష్, లక్ష్మణ్, అనిల్, భగవాన్‌రెడ్డి, కొమ్ము ప్రవీణ్, శంకర్, రాజు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ సింగరేణి బాధ్యత : జీఎం సంజీవరెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ సింగరేణి యాజమాన్యంపై ఉందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నస్పూర్ డిస్పెన్సరీలో డీవైసీఎంఓ డాక్టర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒప్పంద కార్మికుల వైద్య శిబిరానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సూచనల మేరకు ఒప్పంద ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో సివిల్ విభాగంలో సుమారు 613 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, అందరూ వైద్య పరీక్షలు చేసుకొని జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సివిల్ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు వారి ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూనే శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిజీఎం సివిల్ ఆనంద్‌కుమార్, డాక్టర్లు మురళీధర్, లోకనాథ్‌రెడ్డి, సివిల్ ఇంజనీర్లు రాము, సత్యనారాయణ, వైద్య, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాంస వ్యర్థాలను మున్సిపల్ వాహనాల్లోనే వేయాలి



నవతెలంగాణ-మందమర్రి

మాంసం వ్యర్థాలను మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మాంసం దుకాణ యజమానులతో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చికెన్, మటన్, చేపల దుకాణ యజమానులు విక్రయించే సమయంలో వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే వేయాలన్నారు. మాంస పదార్థాలు అమ్మేటప్పుడు వాటిపై ఈగలు, దోమలు వాలకుండా జాలీలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. షాపు పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బ్లీచింగ్ పౌడర్, నువాన్, ఫినాయిల్ మొదలైన వాటితో శుభ్రపరచుకోవాలని ఆదేశించారు. ఎక్కడ పడితే అక్కడ మాంస వ్యర్థాలు పారవేసే వారిపై మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

భగీరథ కార్మికుల వేతన వెతలు..!

- ఐదు నెలలుగా జీతాల కోసం నిరీక్షణ
- పట్టించుకోని కాంట్రాక్టు సంస్థలు

నవతెలంగాణ-కెరమెరి

ప్రజలకు సురక్షిత తాగునీటిని అందిస్తున్న మిషన్ భగీరథ కార్మికులు కష్టాల కడలిలో జీవనం సాగిస్తున్నారు. కాంట్రాక్టు సంస్థలు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోగా అరకొర వేతనాలతో పని చేస్తున్న కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. కాంట్రాక్టు సంస్థలు పట్టించుకోకపోవడంతో రోజులెలా వెళ్లదీయాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు సంస్థల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులతో తాము ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో పోషణ భారమై మానసికంగా కృంగిపోతున్నారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

జిల్లావ్యాప్తంగా మిషన్ భగీరథలో పలు సంస్థల ఆధ్వర్యంలో సుమారు 600 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ సంస్థల ఆధ్వర్యంలో మిషన్ భగీరథ పనులు జరగగా, పదేళ్లపాటు ఆయా సంస్థలు నీటి సరఫరా బాధ్యతలు కూడా చూసుకోవాలి. ఐదు సంవత్సరాలుగా వ్యాప్తంగా 600 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో సూపర్వైజర్లు, లైన్‌మెన్లు, పంపు ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వాచ్‌మెన్లు, ఫిల్టర్లు, ఫిట్టర్లు, వెల్డర్లు తదితరులున్నారు. వీరికి ఒక సంస్థ మినహా మిగతా సంస్థలు నాలుగు నెలలకు పైగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులంతా అవస్థలు పడుతున్నారు.

కాంట్రాక్టు సంస్థల ఇష్టారాజ్యం

కార్మికులకు వేతనాలు చెల్లింపు విషయంలో కాంట్రాక్టు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిత్యం ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం 5వ నెల గడుస్తున్నా వేతనాల జాడ లేకుండా ఉంది.

సగం జీతం కూడా ఇవ్వని సంస్థలు

మిషన్ భగీరథలో పని చేసే కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.19500 చొప్పున కంపెనీలకు చెల్లిస్తుంది. అయితే కంపెనీలు మాత్రం కేటగిరీని బట్టి కార్మికులకు చెల్లిస్తున్నాయి. వాస్తవంగా ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించడంతో పాటు కిందిస్థాయి కార్మికులకు కనీస వేతనం రూ.15వేలు చెల్లించాల్సి ఉంది. అయినా వేతనాల చెల్లింపులో వ్యత్యాసం చూపుతున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. 5నెలల పాటు పనులు చేయించుకొని ఇంత కాలానికి ఒక్క నెల జీతం మాత్రమే ఇస్తూ సంస్థలు చేతులు దులుపుకుంటున్నాయి. సంబంధిత కాంట్రాక్టు సంస్థలు కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగిస్తున్నాయి. ఇదేంటని ప్రశ్నించిన కార్మికుల పట్ల బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో తమకు వేతనాలు పెంచాలని కార్మికుల పెద్ద ఎత్తున వివిధ సందర్భాల్లో నిరసన వ్యక్తం చేసినప్పటికీ పట్టించుకునేనాథుడే లేడని కార్మికులు వాపోతున్నారు.



జీతాలు చెల్లించాలని అధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న కార్మికులు(ఫైల్)



కెస్లాగూడ ప్లాంట్ వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తాం : కూటికల ఆనంద్‌రావ్, సీఐటీయూ మండలాధ్యక్షుడు



మిషన్ భగీరథ పథకంలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదు. ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ వేతనాలు సక్రమంగా చెల్లించకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు తీరు మార్చుకోని పక్షంలో కార్మికుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తాం.

ప్రభుత్వం ఆదుకోవాలి : బుద్దన్న, మిషన్ భగీరథ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు



ప్రతి నెల వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఇచ్చే అరకొర వేతనాలను 5నెలల పాటు చెల్లించకుంటే ఎలా బతికేది. కేవలం ఒక నెల జీతం చెల్లిస్తూ కాలయాపన చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వేతనాలపై ప్రాజెక్టు మేనేజర్‌కు విన్నవించినా ఫలితం లేకపోగా, పని చేస్తే చేయండని, లేకపోతే వేరే చోట పని చేసుకోవాలని దురుసుగా మాట్లాడుతున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

నీటి లీకేజీలు ముందుగానే గుర్తించాలి

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ ప్రజల అవసరాల మేరకు నీటి సరఫరా నిరంతరం కొనసాగిస్తూ లీకేజీలు ముందస్తుగా గుర్తించి నివారించాలని ఎంపీడీఓ గుర్రం సత్యనారయణ సూచించారు. మంగళవారం షెట్‌పల్లి గ్రామంలో పర్యటించిన ఆయన వార్డుల వారీగా నీటి సరఫరా తీరును పరిశీలించారు. లీకేజీలు లేకుండా చూసుకోవడంతో పాటు వర్షపు నీరు ఎక్కడా నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని, మురుగు నీటి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామ సభలు ఏర్పాటు చేయాలని, పంచాయతీ ద్వారా చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులు, తాగు నీటి సరఫరాకు సంబంధించిన విషయాలను గ్రామస్తులతో చర్చించాలని తెలిపారు.



మున్సిపల్ జవాన్‌కు నివాళులు

నిర్మల్ : మున్సిపాలిటీలో జవాన్‌గా పనిచేస్తున్న కూరన్నపేట్‌కు చెందిన జవాన్ కుంటల పోశెట్టి అనారోగ్యంతో తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, కౌన్సిల్ సభ్యులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ నుండి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పటేల్ రమేష్‌రెడ్డిని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బూర్గుల మల్లేష్, ఉపాధ్యక్షులు తడ్పేన వెంకట్‌రెడ్డి, మావల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, నలిమెల నవీన్‌రెడ్డి, కుదురుపాక సురేష్, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మేనేజర్ ఆధార్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



పట్టణంలోని పలు ఈ సేవ, ఆధార్ సెంటర్‌లను రాష్ట్ర యూఐడీఏఐ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ వినయ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టరు, ఆన్‌లైన్ ప్రాసెస్‌ని క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. సిటిజెన్స్ సరైన డాక్యుమెంట్స్ ఆధార్ సెంటర్‌కు తీసుకురావాల్సిందిగా సూచించారు. ఈ సందర్శనలో కలెక్టరేట్ ఈడీఎం బండి రవి, ఈ సేవ సెంటర్ మేనేజర్ జోగు సాగర్, ఆపరేటర్ స్వాగత్ ఉన్నారు.

ఆదిలాబాద్‌లో కురిసిన భారీ వర్షం

- ఉప్పొంగిన వాగులు, జలపాతాల వద్ద జల సవ్వడి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనానికి తోడు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో ఉమ్మడి ఆదిలాబాద్ లో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం తెల్లవారు జామునుంచి ముసురుగా ఏర్పడి ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం వరకు భారీగా కురిసింది. భారీ వర్షంతో పల్లె, పట్టణమంతా తడిసిపోయింది. పంటల సాగు కోసం గత కొన్ని రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో సాగు చేసిన సోయా, పత్తి, కంది పంటకు మేలు చేకూరనుంది.

పొంగుతున్న వాగులు, వంకలు, జలపాతాలు..

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆయా మండలాల్లో ఉన్న చిన్నపాటి వాగులు జలకళ సంతరించుకుంది. జలపాతాల్లో జలసవ్వడి చేస్తుంది. జిల్లాలో ఉన్న సాత్నాల, మత్తడి, కుంటాల, గాయత్రి, పొచ్చెర, ఖండాల తదితర జలపాతాలకు భారీగా నీరు వచ్చి చేరడంతో ఉప్పొంగి ప్రవహిస్తూ జలసంద్రంగా మారాయి. పలువురు పర్యాటకులు జలపాతాలను చూసేందుకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. సెల్ఫీలు ఫొటోలు దిగుతున్నారు.

రోడ్లు జలమయం.. బురదమయం..

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇంద్రవెల్లి, తాంసి, తలమడుగు, జైనథ్, బేల, ఇచ్చోడ, బోథ్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు జయమయంతో నిండిపోగా.. గుంత గుంతలుగా ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు కాలనీల్లో రోడ్లు సరిగ్గా లేకపోవడంతో బురదమయంగా మారాయి. దీంతో ప్రజలకు రాకపోకలకై ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నమోదైన వర్షపాతం ఇలా..

జిల్లాలోని బోథ్ మండలం సొనాలలో 78 మిల్లీమీటర్లు, జైనథ్ మండలం బోరజ్‌లో 25 మిల్లీమీటర్లు, ఇచ్చోడ మండల కేంద్రంలో 16, బేలలో 15, ఆదిలాబాద్ పట్టణ పరిధిలో 13.5 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న ఐదు రోజుల్లో వర్షాలు భారీగా కురిసే అవకాశాలున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదిలాబాద్ జిల్లాలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయన్న సూచనల మేరకు జిల్లా యంత్రాంగం కూడా అప్రమత్తమైంది.





రుణమాఫీ జీఓను సవరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రుణమాఫీ జీఓను రైతుల రుణమాఫీకి ప్రయోజనకరంగా సవరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల రుణమాఫీకి రూపొందించిన నిబంధనలలో గల అంశాలను సవరించి, రూ.2 లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధి కలుగునట్టు సవరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం రేషన్ కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకేకుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికే రుణమాఫీ వర్తింపజేయడం వలన కుటుంబంతో వేరుపడిన వారికి రుణమాఫీ వర్తించదని పేర్కొన్నారు. ఆదార్‌కార్డు, పాస్‌బుక్ డేటా, పీడీఎస్(రేషన్‌కార్డు డేటా) ఒకటిగా ఉన్న వారికే వర్తింపచేశారని, ఆదార్‌కార్డు లేని వారు, పాస్‌బుక్, రేషన్ కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయని తెలిపారు. పాసు పుస్తకాల కొరకు ధరణిలో 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్టు ప్రభుత్వ ప్రజాపాలన సర్వేలో తేలిందని, అలాగే రేషన్‌కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారు కూడా లక్షల సంఖ్యలో ఉన్నారని పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలుగా బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం వల్ల అసలుకు మించి వడ్డీలు పెరిగాయని చాలామంది రైతులు రెండు లక్షలకు పైగా బాకీలు ఉన్నప్పటికీ గతంలో ప్రకటించిన 2014, 2018 రుణమాఫీ పథకాలు వారికి వర్తించలేదని పేర్కొన్నారు. అందువల్ల రీషెడ్యూల్ చేసిన రుణాలకు లేదా బుక్ అడ్జెస్టమెంట్ చేసిన రుణాలకు రుణమాఫీని వర్తింపజేయాలని, ఇందుకు అనుగుణంగా జీఓను సవరించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నవతెలంగాణ-కడెం

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందిన సంఘటన మండలంలోని చిట్యాల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాల్ గ్రామానికి చెందిన పందిరి గంగారాం(27) అనునతడు గత కొంత కాలంగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఉండగా 10న బుధవారం రాత్రి 10 గంటలకు తల్లి, భార్య మందలించగా క్షణికావేశంలో గుర్తు తెలియని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడి నుంచి నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి సీతాబాయి ఫిర్యాదు మేరకు కడెం ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట..



నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ గడుగు దేవమ్మ మాట్లాడారు. రెండున్నర సంవత్సరాలు ఉన్న చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీలో చేర్పుకోవడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి తిరిగి పిల్లలను గుర్తించి, అంగన్‌వాడీలో అడ్మిషన్ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సూరం గంగమ్మ ఆయా రాధ, అంగన్‌వాడీ చిన్నారులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనివ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముదిరాజ్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తగిన ప్రాధాన్యతనివ్వాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య మాట్లాడుతూ 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ(డి) నుంచి బీసీ(ఎ)లో మారుస్తు జీఓ 15ను విడుదల చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అభయహస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని, బీసీ(ఎ)తో పాటు ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని అన్నారు. కానీ రాష్ట్రంలో అత్యధికంగా ముదిరాజ్ మత్స్య సహకార సంఘాలు ఉండగా ఇతర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఛైర్మన్‌గా నియమించడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీనిపై వెంటనే పున:సమీక్షించుకొని మత్స్య సహకార సంఘాలకు న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, అందుకు అనుగుణంగా ముదిరాజ్‌లకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గాన్ని రాజకీయంగా అభివృద్ధి చేసేందుకు మూడు ఎమ్మెల్సీ పదవులతో పాటు ఒక రాజ్యసభ పదవిని 10 కార్పొరేషన్ పదవులను కట్టబెట్టాలని అన్నారు. అదే విధంగా ముదిరాజ్ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు మంజూరు చేశారని, దాని ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ, ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు దారవేణి రాము, ప్రధాన కార్యదర్శి రవి, గౌరవ అధ్యక్షుడు పులి నగేష్, సలేంద్ర రాజు, నాయకులు బొమ్మెన లస్మన్న, పొచ్చన్న, చిన్నయ్య పాల్గొన్నారు.

బంజారా నూతన తీజ్ పాట ఆవిష్కరణ



నవతెలంగాణ-నార్నూర్

రేలరేల, మాటీవీ ఫేమ్ సింగర్ గిరిజన గాయకుడు మోహన్ నాయక్ 2024 నూతన తీజ్ బంజారా పాటను పాడారు. ఈ సందర్భంగా మంగళవారం జామడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీజ్ అడబిడ్డల పడుంగగా 9 రోజుల పాటు దేశ వ్యాప్తంగా గిరిజన తండాలో నిర్వహించే తీజ్ ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయాలను ఆచారాలను కాపాడడానికి భావితరాలకు గుర్తుండి పోయేలా పాటను చిత్రీకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాట ఆవిష్కరణలో పాఠశాల సిబ్బంది ఆడే విశ్వనాథ్, జాదవ్ శివాజీ, ఆడే కైలాస్, గంగాధర్, రాథోడ్ రవీందర్, రజినీకాంత్ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

తమతో పాటు చదువుకున్న తోటి స్నేహితులందరూ కలిసి మంగళవారం బాధిత స్నేహితుడి కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం చేసి ఉదారత చాటుకున్నారు. ఆదిలాబాద్ మండలంలోని చాంద(టి)కి చెందిన సురేందర్ గత సంవత్సరం కింద మరణించారు. ఈ నేపథ్యంలో అతని కుటుంబ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని స్నేహితులంతా కలిసి రూ.50 వేల వరకు జమ చేసి సురేందర్ భార్య, కూతురి అకౌంట్‌లలో జమ చేశారు. దానికి సంబంధించిన బాండ్ పేపర్‌ను మంగళవారం వారి నివాసానికి వెళ్లి అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెంజర్ల ప్రవీణ్, రమాకాంత్, కిరణ్, శ్రీకాంత్, రామన్న ఉన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పారామెడికల్ హెల్త్ వర్కర్ సురేష్ణ అన్నారు. మంగళవారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అర్లి(బి) గ్రామంలో డ్వాక్రా మహిళలకు, వీఓలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలు కౌన్సెలింగ్ సేవలు, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళల, బాలికల చట్టాలు, గృహ హింస చట్టం, బాల్యవివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, తదితర చట్టాల గురించి, సఖి కేంద్రంలో వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. అత్యవసర సమయాలలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నెంబర్లు 181, 100, 1098, 1930 ఈ కాలంలో జరుగుతున్న హింసలు, లింగ సమానత్వం, విద్య ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ విఠల్, మాజీ సర్పంచ్ వినోద్, గ్రామ డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రయివేటు డీలర్ల వద్ద కూడా యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయివేటు డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక ఏర్పాటు చేయాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

20న టీజీ ఆర్టీసీ కార్మిక సంఘాల సమావేశం

నవతెలంగాణ-నిర్మల్

టీజీ ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం ఈనెల 20న హైదరాబాద్‌లోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఉంటుందని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బాబు, ఈ వెంకన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని సంఘాలను ఆహ్వానించడం జరిగిందని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 123 మంది లబ్ధిదారులకు రూ.25లక్షల 9వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ పేదింటి ప్రజల వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ ఆపలేదని అన్నారు. కానీ మన దురదృష్టం రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన వచ్చి కేవలం చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని, వేల సంఖ్యలో చెక్కులను కొట్టివేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, రాజారాం, తోట వెంకటేష్, నాగయ్య, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు డీఈఓ ప్రణీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 15వ తేదీ వరకు గడువు ఉండగా జులై 21వ తేదీ వరకు పొడగించినట్టు పేర్కొన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ఆన్‌లైన్ పేమెంట్ కాపీతో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పంట పండించే ప్రతి రైతుకు రుణమాఫీ జరగాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సొంత భూమి ఉండి పంట పండించిన రైతుకు రుణమాఫీ, రైతు భరోసా అందించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వం రేషన్ కార్డులే ఇవ్వలేదని అలాంటిది రేషన్ కార్డు ప్రతిపాదికన కుటుంబాలను గుర్తించడం అనేది సరియైన పద్ధతి కాదని పేర్కొన్నారు. బ్యాంకుల్లో పంట రుణం తీసుకున్న ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ జరగాలని అలాగే పంట పండించే ప్రతి రైతుకు రైతు భరోసా డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేసి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని సమీక్షల పేరిట కాలయాపన చేయకుండా రైతుబంధును వెంటనే విడుదల చేసి సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | జులై 17, 2024 | www.navatelangana.com

ఇందానీలో డ్రై డే

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇందానీ గ్రామంలో డ్రైడే నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. పరిసర ప్రాంతాలతో పాటు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించామని



తెలిపారు. ఎప్పటికప్పుడు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉన్న పాత టైర్లు, డబ్బాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కాంత, వైద్య సిబ్బంది కమల, సుచిత్ర, చంద్రకళ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసుల పంపిణీ

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులను అందజేసినట్టు ఎంపీడీఓ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కోసం బస్‌పాసులను అందజేస్తుందని, మండలంలోని 70 మంది దివ్యాంగులకు బస్‌పాసులను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల పాసులు తీసుకోని వారు ఆర్టీసీలో సంప్రదించి ఆసిఫాబాద్‌లో బస్‌పాసులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, దివ్యాంగుల సంఘం నాయకులు రవిశంకర్, ఆర్టీసీ సిబ్బంది తులసీరాం పాల్గొన్నారు.

నర్సరీనా..? పిచ్చి మొక్కలా..?



నవతెలంగాణ-కౌటాల

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం మొక్కల పెంపకం కోసం నర్సరీలను ఏర్పాటు చేసింది. అయితే నిర్వహణ లేక అవి నర్సరీలా కాకుండా పిచ్చి మొక్కల వనంలా కనిపిస్తున్నాయి. మండలంలోని బాల్లెపల్లి గ్రామంలో తెలంగాణకు హరితహారంలో భాగంగా ప్రభుత్వ నిధులతో మొక్కల పెంపకం నర్సరీని ఏర్పాటు చేశారు. వర్షాకాలం మొదలు కాగానే మొక్కలను ఇంటింటికి పంపిణీ చేసి మొక్కలు పెంచె కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశించడంతో నర్సరీని పెంచారు. అది మొక్కల పెంపకం నర్సరీల కాకుండా పిచ్చి మొక్కలు పెంచే కంచలా దర్శనమిస్తుంది. మండల స్థాయి సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలాంటివి చూడాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. నిధులు వృధా కాకుండా ఉండాలంటే సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరుతున్నారు.

సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గోలేటి టౌన్ షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహజంచారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి ఉద్యోగులు, గ్రామస్తులను పరీక్షించారు. దీర్ఘకాలిక వ్యాదులు కీళ్ళ, మోకాళ్ళ నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, అస్తమా, స్త్రీల వ్యాధులకు మందులు అందజేశారు. ప్రతి నెల 16వ తేదీన ఆయుర్వేద వైద్య శిభిరం కొనసాగుతుందని అధికార ప్రతినిధి తెలిపారు.

ఇంటికో మొక్క నాటాలి



నవతెలంగాణ-కౌటాల

ఇంకో మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏపీఓ పూర్ణిమతో కలిసి ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటి వాటిని కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకం వల్ల కాలుష్య నివారణ తగ్గుతుందని, వ్యాధుల బారిన పడకుండా మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆర్ఎంపీ, పీఎంపీలు పాలాభిషేకం చేశారు. ఆర్ఎంపీలకు శిక్షణ అందించి వారికి సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో గౌరవాన్ని ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో మంగళవారం ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ అధ్యక్షుడు ఇబ్రహీం మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి ముఖ్యమంత్రి గొప్ప ప్రకటన చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్. కాంగ్రెస్ నాయకులు నరేందర్ గౌడ్, హకీమ్, ఆర్ఎంపీలు భాస్కర్, అజార్, సురేందర్ పాల్గొన్నారు.

వాంకిడిలో వర్షం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో ఉదయం నుండే వర్షం జోరుగా కురుస్తుంది. రానున్న రెండు, మూడు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలియజేయడంతో ప్రజలు ముందు జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సాగర్ తెలిపారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తాయని ప్రజలు ఎవరు కూడా వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేసి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఆసిఫాబాద్ : కేజీబీవీలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని కేజీబీవీల్లో విద్యార్థినులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల కేజీబీవీ పాఠశాలను జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, మూత్రశాలలు, తరగతి గదులు, భోజనశాల, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాలయంలో బాలికలకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల శుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని, ప్రతిరోజు విద్యాలయ పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, భోజనంలో తాజా కూరగాయలతో చేసిన ఆహారాన్ని అందించాలని, నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి నలంద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెబ్బెన : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆస్పత్రి వార్డులు, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రజల సౌకర్యార్థం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అంటువ్యాధులు, విష జ్వరాలకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. వాగులు ఉధృతంగా ప్రవహించే సమీప గ్రామాలలో గర్భిణులను గుర్తించి ప్రసవాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి సంరక్షించాలని, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రెబ్బెన : పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

అమ్మ మాట..అంగన్‌వాడీ బాట ప్రారంభం



బెజ్జూర్ : అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ-బెజ్జూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల లో గల కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరిగి రెండు సంవత్సరాలుపైబడిన పిల్లల పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. బెజ్జూరు అంగన్‌వాడీ 2 కేంద్రం నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎంపీటీసీ పర్విన్ సుల్తానా, బారెగూడ గ్రామంలో సూపర్‌వైజర్ కే.కరుణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, అంగన్‌వాడీలను బలోపేతం చేయాలన్నారు. కేంద్రంలో పిల్లల విద్యతో పాటు ఆటలు ఆహ్లాదకరమైన వాతావరణంతో ఆరోగ్య సమాజం నిర్మాణం అవుతుందన్నారు. గర్భిణీ, బాలింతల పౌష్టిక స్థితిగతులు కూడా చూస్తారని అదేవిధంగా పౌష్టిక ఆహారాన్ని కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ శ్రీలత, ఆశా కార్యకర్త నాగమణి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కోట ప్రసాద్ మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరిగి రెండు సంవత్సరాల పైబడిన పిల్లల పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, హెల్త్ సూపర్‌వైజర్ ఇందిరాగాంధీ, పంచాయతీ సెక్రటరీలు రమేష్, ఆసీఫ్ అలీ, జూనియర్ అసిస్టెంట్ పెంటు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చింతలమానేపల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి
- మహిళా శక్తి పథకంపై అవగాహన



మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలంలోని అప్పపల్లి, ఆర్ఆర్ కాలనీలలో మహిళా శక్తి పథకంలో ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో గుర్తించిన యూనిట్ లబ్ధిదారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. ఇందులో స్త్రీ నిధి బ్యాంక్ ద్వారా డైరీ, పెరటి కోళ్ళ, మదర్ ఈట్, సోలార్ కుసుమ్ యూనిట్, న్యూ ఎంటర్‌ప్రైజెస్, కిరాణం, గిర్ని పలు అంశాలపై చర్చించి యూనిట్ నిర్వహణపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. అర్హత గల లబ్ధిదారులు రుణ సదుపాయాన్ని వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఎదుగుదలే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. నూతన గ్రూపులో సభ్యులుగా చేరాలని, ప్రతి ఒక్క మహిళ 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపల ప్రత్యేకమైన సంఘంలో చేరి సంఘం బలోపేతం చేసి ఆర్థిక అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం డైరీకి (ఆవు, గేదె) యూనిట్‌కు ఎంపికైన లబ్ధిదారులతో మాట్లాడి పశువులను పక్క రాష్ట్రాల నుండి తీసుకురావాలని, ప్రతిరోజు 8 నుంచి 10 లీటర్లు పాల ఉత్పత్తి జరుగుతుందని, ఉత్పత్తి అయిన పాలు విజయ డైరీకి పంపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, ఏపీఎం శ్రీనివాస్, స్త్రీ నిధి ఆర్ఎం శ్రీనివాస్, మేనేజర్ హెక్సు, సీసీలు సురేందర్, హనుమంతు, శంకర్, వీఓఏ కవిత, వీఓఓబీ పార్వతీ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

కెరమెరి : వేతనాలు చెల్లించాలని ఎల్ అండ్ టీ ప్రాజెక్టు మేనేజర్ భాను ప్రకాష్‌కు కార్మికులు వినతిపత్రం అందించారు. కొన్ని సంవత్సరాలుగా ఎల్ అండ్ టీ సంస్థ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించాలని వేడుకున్నారు. 5 నెలలుగా వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. వేతనాలు సక్రమంగా రాకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు . ఈ నెలాఖరులో గల పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించని పక్షంలో తాము విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. అందుకు స్పందించిన ప్రాజెక్టు మేనేజర్ భాను ప్రకాష్ ఈ నెలాఖరులోగా ఒక నెలకు సంబంధించిన వేతనం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రం అందించిన వారిలో మిషన్ భగీరథ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు బుడ్డన్న, చౌహన్ చరణ్, సంతోష్, గౌతమ్ పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిమ్స్ చిత్రీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం రెండు షార్ట్ ఫిలిమ్స్‌ను చిత్రీకరించారు. స్థానిక పెట్రోల్‌పంపు ఏరియాలో విలువ, ప్రేమ ఒక పిచ్చి అనే రెండు షార్ట్ ఫిలింస్‌ను చిత్రీకరించారు. వీటికి లింగపల్లి రితీష్ దర్శకత్వం వహిస్తున్నారు. కార్యక్రమంలో నటులు పవన్, ప్రశాంత్, మహేష్, వరుణ్, షార్ట్ ఫిలిం డైరెక్టర్ ఈర్ల సునీల్, రాజా నర్సయ్య పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని ఎన్‌హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న 2వ ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్ డిమాండ్ చేశారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో రెండవ ఏఎన్ఎంలతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్న 2వ ఏఎన్ఎంలను ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. గతంలోనే తీవ్రమైన పని ఒత్తిడి ఉండగా ప్రస్తుతం 4 కొత్త అప్లికేషన్లు తీసుకవచ్చి మరింత పనిభారం పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రకాల 15 డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే దిశగా ఈనెల 18న కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో జిల్లా నుండి పెద్ద ఎత్తున రెండవ ఏఎన్ఎంలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, రెండవ ఏఎన్ఎంల సంఘ నాయకులు వసంత, భూదేవి, సునీత, సంగీత, సత్యమ్మ, పరమేశ్వరి పాల్గొన్నారు.

పీఎం జీవనజ్యోతి బీమా సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రైతులు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ అధికారి అంజన్న అన్నారు. మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకు ఆవరణలో రైతుల ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా, డిజిటల్ లావాదేవీలు, స్వల్ప, దీర్ఘకాలిక రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంకులలో ఖాతాలు తెరుచుకొని డిజిటల్ లావదేవిలను వినియోగించుకుంటూ ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ రాకేష్, మాజీ సీఈఓ హనుమంతు, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి రాజులనాయుడు ఆధ్వర్యంలో రైతులకు వానాకాలం పంటల్లో ఎరువుల యాజమాన్యంపై రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఎరువులు ఏ మోతాదులో వాడాలి, ఎంత మోతాదులో వాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. రైతులు వానాకాలంలో వేసే ఎరువులను ఏ పంటకు ఎంత మోతాదులో వాడాలో దీని ద్వారా రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీవిద్య, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని అనార్‌పల్లి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి అవసరమున్న వారికి మందులు అందించారు. వర్ష కాలంలో వ్యాధులు ప్రబలే అవకాముండున పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను విద్యార్థులు పాటించాలని సూచించారు. అనారోగ్యం అనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలిరాం, వార్డెన్ వసంత్ రావు, వైద్య సిబ్బంది సంఘమిత్ర పాల్గొన్నారు.

కౌటాల కేజీబీవీలో వైద్య శిబిరం

కౌటాల : మండల కేంద్రంలోని కస్తూర్బ గాంధీ వసతి గృహ పాఠశాలలో మంగళవారం కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తమ్సీయ బేగం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో పారిశుధ్యం పాటించాలని సిబ్బంది, విద్యార్థులకు సూచించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వ్యాధుల నివారణ చేయాలంటే పారి శుద్ధ్యం ముఖ్యమన్నారు. అనంతరం పాఠశాలలోని బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది రేణుక, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలున్నారు.



కౌటాల

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | జులై 17, 2024 | www.navatelangana.com

డెంగ్యూపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-వేమనపల్లి



కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ మాస ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజేష్ డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తాయని ఇంటిలో, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ జ్వరాలను కలిగిస్తాయని తెలియజేశారు. ప్రతి వారం డ్రైడే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమములో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి రాజారెడ్డి, సూపర్‌వైజర్ అపరంజి, స్టాఫ్ నర్స్ శ్రీవాణీ, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

నవతెలంగాణ-జన్నారం



ఆరేళ్ల లోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని మండలంలోని తిమ్మాపూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్లు జాడి సంజీవరాణి, గంజాయిల జమున కోరారు. అధికారుల ఆదేశాల మేరకు అమ్మ మాట-అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పలు కాలనీల్లో అంగన్వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఆరేళ్ల లోపు ఉన్న చిన్నారుల వివరాలను నమోదు చేసుకుని వారిని తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. గ్రామ కార్యదర్శి లావణ్య, సీపీ లలిత, ఆశా కార్యకర్త రజిత పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యంతో పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ యూనిట్-2లో కొనసాగుతున్న క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులు నిర్దేషిత లక్ష్యంతో పూర్తి చేయాలని సింగరేణి సంచాలకులు (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను సంధర్శించిన ఆయన యూనిట్-2లో నిర్వహిస్తున్న పనులు పరిశీలించారు. బాయిలర్, టర్బైన్, జనరేటర్‌తో పాటు ఇతర విభాగాలలో కొనసాగుతున్న పనులు పరిశీలించారు. క్యాపిటల్ ఓవర్ హాలింగ్ పనులలో పాల్గొంటున్న ఇంజనీర్లు, ఉద్యోగులను అభినందిస్తూ పనుల నిర్వాహణ పట్ల తగు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు పనుల నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి యూనిట్-2 నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్(ఓఅండ్ఎం) ఈడీ జేఎన్ సింగ్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఎస్టీపీపీ జీఎం (ఈఅండ్ఎం) శ్రీనివాసులు, ఏజీఎం (సివిల్) కేఎస్ఎన్ ప్రసాద్, ఏజీఎం(ఎఫ్‌జీడీ) ఎంఎస్‌వీ రమణ, ఏజీఎం మదన్ మోహన్, బాయిలర్ ఇన్‌చార్జి సముద్రాల శ్రీనివాస్, ఎస్ఓటూ ఈడీ ప్రభాకర్, శ్రీరాంపూర్ (సీఎంఓఏఐ) ప్రసిడెంట్ కేవీరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా ఆకారం రమేష్ నియామకం



నవతెలంగాణ-మందమర్రి

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా పట్టణానికి చెందిన ఆకారం రమేష్‌ను ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ నాగరి ప్రీతమ్ నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నూర్ శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి నియామక పత్రాన్ని ఆకారం రమేష్‌కు అందజేశారు. 20 సంవత్సరాలుగా రమేష్ ఎన్ఎస్‌యూఐ పట్టణ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో చురుగ్గా పని చేశారు. అతని సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం రాష్ట్ర కన్వినర్ బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా ఆకారం రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల సహకారంతో దళితుల ఉన్నతికై తన వంతు కృషి చేస్తానని అన్నారు. నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



నవతెలంగాణ-దండేపల్లి

ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని దండేపల్లి ఎస్ఐ ఉదయ్ కిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులకు పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి అన్నారు. నేరాల నియంత్రణ, దర్యాప్తులో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారుతుందన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నాయకులను, ప్రజాప్రతినిధులను కోరారు. గ్రామంలో ఎటువంటి నేరాలు జరిగినా కెమెరాల వల్ల పోలీసుల దృష్టికి వస్తుందని తెలిపారు. ప్రతీ ఊరిలో సీసీ కెమెరాలను స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అసాంఘిక శక్తులకు ప్రజలు సహకరించవద్దని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత సన్మార్గంలో పయనించాలని వ్యసనాలకు బానిస కాకుండా స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం అడిగితే తెలియజేయవద్దని సూచించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల సభ్యులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం పండుగ

నవతెలంగాణ-జన్నారం

పట్టణంలో మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా నిర్వాహకులు మంగళవారం పట్టణంలోని అక్కపల్లి గూడెం నుంచి కవ్వాల్ చౌరస్తా మీదుగా ప్రధాన రహదారిపై పీరీలను ఊరేగించారు. అలాగే మండలంలోని కామన్ పల్లి దేవుని గూడా కిష్టాపూర్, తపలాపూర్, కలమడుగు, మురిమడుగు గ్రామాల్లో పీరీలను ఊరేగించారు. హిందూ ముస్లిం తేడా లేకుండా ఈ మొహర్రం పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సింగరేణి సిరుల తల్లిని కాపాడుకుందాం



- కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సిరుల తల్లిని కాపాడుకుందామని కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. బొగ్గు బావుల వేలానికి వ్యతిరేకంగా సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా జీఎం మనోహర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బొగ్గు బావుల ప్రయివేటీకరణ ఓపెన్ టెండర్ల రద్దు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ టెండర్లలో పాల్గొనకుండా కేంద్ర ప్రభుత్వ విధానాన్ని అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సింగరేణిలో 139 సంవత్సరాల అపార అనుభవం ఉన్న సింగరేణి సంస్థకే సింగరేణి బొగ్గు బావులను కేటాయించాలన్నారు. వేలాన్ని రద్దుచేసి సింగరేణికే కేటాయించాలని అందుకు కార్మిక సంఘాలన్నీ ఒక్క తాటిపైకి వచ్చి సింగరేణిని కాపాడుకొనుటకు భాగస్వాములు కావాలన కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సెక్టార్లను కార్పోరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పుటకు ముందుకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వంతో సింగరేణి ఓపెన్ టెండర్లలో పాల్గొనుటకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వేలం పాటలో పాల్గొనాలని చెప్పడం సింగరేణిని నిర్వీర్యం చేయడమే అవుతుందన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పరిశ్రమలను ఆదాని అంబానీలకు ఏజెంట్‌గా మారడాన్ని కార్మిక వర్గం ప్రతిఘటించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఖండించింది. సింగరేణిలోని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా వేలం పాటను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కమిటీ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రెసిడెంట్ జక్కుల నారాయణ, మందమర్రి వైస్ ప్రెసిడెంట్ జక్కినబోయిన శ్రీనివాస్, కేంద్ర నాయకులు వెల్దిసుదర్శన్, పార్వతి రాజిరెడ్డి, బోనాల శ్రీనివాస్, టీఎస్‌టీయూసీ నాయకులు సంజయ్ కుమార్, గద్దల నారాయణ, మణిరాం సింగ్, తెలంగాణ ఉద్యోగుల సంఘం నీరేటి రాజన్న, మిట్టపల్లి కుమారస్వామి, జైపాల్, టి శ్రీనివాస్, సురేందర్ రాములు, జాఫర్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడు అరెస్టు



నవతెలంగాణ-మంచిర్యాల

విజయవాడ నుంచి సూరత్‌కు ట్రైన్‌లో గంజాయి తరలిస్తున్న యువకుడిని మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల జీఆర్పి పోలీసులు. నిందితుడి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల రైల్వే ఎస్ఐ సుధాకర్, సిబ్బందితో కలిసి మంచిర్యాల రైల్వే ప్లాట్ ఫాం తనిఖీ చేసే క్రమంలో అనుమానాస్పదంగా మూడు బ్యాగులతో కనిపించిన యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా విజయవాడలో ఒక వ్యక్తికి గంజాయిని విక్రయించి దాన్ని నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో సూరత్‌కు తరలిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. మంచిర్యాల నుంచి సూరత్ కు వెళ్లేందుకు వేరే ట్రైన్ కోసం ఇక్కడ ఎదురు చూస్తున్న క్రమంలో తనతో పాటు ఉన్న ఇంకో వ్యక్తి పోలీసులు వచ్చేది గమనించి అతను పారిపోయాడని తెలిపాడు. నిందితుడి వద్ద నుండి 3 బ్యాగుల్లో రూ.6,08,500 విలువ గల 24 కిలోల గంజాయిని స్వాధీన పరుచుకున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. ఉన్నత అధికారుల ఉత్తర్వుల ప్రకారం నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రైళ్లలో అక్రమంగా గంజాయి, మత్తు పదార్థాలు తరలించడం చట్ట రీత్యా నేరమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకొనబడతయని అధికారులు సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత

జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాదులైన డెంగ్యూ, మలేరియా, చికెన్గున్యా, అంటు వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత అన్నారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రత్యేక వైద్య నిపుణులు, 23 ఆస్పత్రుల వైద్యులతో సమీక్ష నిర్వహించి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఆస్పత్రులకు వచ్చే జ్వర బాధితుల వివరాలు రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేసి ప్రతి రోజు వివరాలను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. డెంగ్యూపై తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై ప్రజలకు వివరించాలని, ప్రభుత్వ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, టి-డయాగ్నొస్టిక్ హబ్లలో ఎలిసా పరీక్ష నిర్వహించిన తరువాతనే డెంగ్యూగా నిర్ధారణ చేయాలని తెలిపారు. ప్రయివేట్ ఆసుపత్రులలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు-2010 ప్రకారం ఆస్పత్రిలో ఉండవలసిన పరికరాలు, సౌకర్యాలు కల్పించడంతో పాటు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వైద్యుల వివరాలు, రుసుము వివరాలు, ఆస్పత్రిలో అందించే వైద్య సేవల వివరాలు అందరికీ తెలిసే విధంగా ప్రదర్శించాలని, స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ నిరోధక చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీలు చేయరాదని ప్రజలకు అర్థమయ్యే విధంగా గోడప్రతులు, ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఒక వేళ ఆ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా చట్ట రీత్యా నేరమని, తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు వైద్య సేవల కొరకు వైద్యులను సంప్రదించిన సమయంలో వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని, వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందించినట్లయితే తీసుకోవలసిన ముందస్తు చర్యలపై అప్రమత్తంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, డీడీఎం ప్రవళిక, వైద్యులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ పోలీసుల బాధ్యత



నవతెలంగాణ-నస్పూర్

సమాజంలోని మహిళల రక్షణతో పాటు వారి భద్రత విషయంలో పోలీసులు, షీ టీమ్స్ అత్యంత కట్టుదిట్టమైన బాధ్యత యుతంగా వ్యవహరిస్తుందని, పిల్లలు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై భరోసా సెంటర్ వాళ్ళు చూస్తారని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్ కుమార్ అన్నారు. మంగళవారం నస్పూర్ ఏరియాలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయలో విద్యార్థినులకు సైబర్ మోసాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, నేరాలు, ర్యాగింగ్, పోక్సో, ఆత్మహత్యలు, మహిళా చట్టాలు పై షీ టీమ్స్, భరోసా సెంటర్‌తో కలిసి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిస్థితులను గమనిస్తూ మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలబెట్టేది చదువు మాత్రమేనని, నిర్లక్ష్యం చేయరాదని విద్యార్థులకు సూచించారు. అమ్మాయిలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వెంటనే షీ టీం, స్థానిక పోలీసులకు ధైర్యంగా ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. నేటి రోజులలో సెల్ ఫోన్ వినియోగం ఎక్కువైందని, తగ్గించుకొని చదువు పైన శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యార్థులు చిన్న, చిన్న విషయాలకు ఆవేదనకు గురై, కృంగిపోయి, ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. అలాగే యాజమాన్యం ప్రతి స్కూల్ ఆవరణలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ మౌనిక, భరోసా కోఆర్డినేటర్ విజయ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన డీసీపీ



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాలలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని, అడిక్షన్ సెంటర్‌ను మంగళవారం మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ సందర్శించారు. ఆస్పత్రిలోని గదులు, ఆవరణ ప్రాంగణాన్ని సందర్శించారు. సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, డ్యూటీ వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పునరావస కేంద్రం పనితీరును అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై తగు సూచనలు చేశారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, పట్టణ ఇన్స్‌పెక్టర్ బన్సీలాల్ పాల్గొన్నారు.

వన మహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ



నవతెలంగాణ-మందమర్రి

వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని విద్యానగర్ ఏరియాలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. మొక్కల సంరక్షణ బాధ్యతను కూడా చేపట్టవలసిందిగా కోరారు. అనంతరం మినీ ట్యాంక్ బండ్ వద్ద మున్సిపల్ సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సుమతి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వి ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ ఎండీ సోహలుద్దీన్, వార్డు ఆఫీసర్లు కే రాజన్న, దుర్గం శ్రీనివాస్, దుర్గం దుర్గా ప్రసాద్, బిల్ కలెక్టర్లు ఏ లక్ష్మీనారాయణ, డి చంద్రశేఖర్, ఇన్‌చార్జి మెప్మా టీఎంసీ ఏనుగు రఘురాం, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎం గోపికృష్ణ, డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి శ్యాంబాబు పాల్గొన్నారు.

ఉపరితల గనిని సందర్శించిన డైరెక్టర్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గనిని డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ క్వారీలోని జీవీఆర్, సీఆర్ఆర్ ఓబి కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులతో రోజువారి నిర్దేశిత లక్ష్యం లక్ష్య క్యూబిక్ మీటర్లను తప్పనిసరిగా తీయాలని సూచించారు. దానికి సంబంధించి అన్ని ప్రణాళికలు వేసుకోవాలని, వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని అలాగే రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించడానికి ప్రతి ఒక్క ఉద్యోగి అధికారి కృషి చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత ఉత్పత్తి ఉత్పాదకత సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు శ్రీనివాస్, శ్రీనివాస్, గని మేనేజర్ బ్రహ్మాజీ, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

దళితవాడ దారి సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఉత్కూర్‌లోని దళితవాడ దారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని యూత్ నాయకుడు దర్శనాల నవీన్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో 9వ వార్డ్‌లో అంగన్‌వాడీకి వెళ్లే దారిలో నీరు ఆగుతున్న ప్రాంతాన్ని స్థానిక యువకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఇండ్లలోకి నీరు చేరడంతో డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు బారిన పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోలేదని, తాను ఎన్నిసార్లు చెప్పిన ప్రయోజనం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. రోడ్డు ఎత్తు పెంచి నిర్మించక పోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఒరగంటి శ్రీధర్, వెంకటేష్. ప్రవీణ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

5

బుధవారం | జులై 17, 2024 | www.navatelangana.com

ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి మంచి స్పందన లభించింది. కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ఇందులో 11 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అనిత దంపతులు తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీఓ విడుదల చేసేంతవరకూ ఉద్యమిస్తాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అంగన్‌వాడీలకు సంబంధించి మంత్రి సీతక్క ఇచ్చిన హామీకి సంబంధించిన జీఓ విడుదల అయ్యేంత వరకు పోరాటం కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి అన్నారు. 12వ రోజు కలెక్టరేట్ ఎదుట దీక్షలో అంగన్‌వాడీలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం మంత్రి సీతక్క హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇదే సందర్భంలో మంత్రి హామీకి సంబంధించి జీఓ వచ్చి అది అమలు అయ్యే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. జీఓ తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతా

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రమేష్



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికి అందేలా కృషి చేస్తానని, ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతానని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఆకార రమేష్ అన్నారు. కన్వీనర్‌గా నియమితులైన ఆయనను మంగళవారం జైపూర్ మండల నాయకులు మందమర్రిలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. సామాజికవర్గం నాయకుల సహాయ సహకారాలు, సలహాలు సూచనలతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ, గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ షెడ్యూల్ కులాల అభివృద్ధికి పాటుపడుతానని పేర్కొన్నారు. కాగా ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమించుటకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అకార రమేష్‌ను కలిసిన వారిలో జైపూర్ మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు శీలం వెంకటేశం ఉన్నారు.

పండగలు ప్రశాంతతను పెంచాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పండగలు ప్రశాంతతను పెంచాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. మొహర్రం ఉత్సవాల సందర్భంగా 9వ రోజు సరిగెత్తు సందర్భంగా ఊరేగింపులో భాగంగా తన నివాసానికి వచ్చిన పీరీలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల మతాలకతీతంగా మొహర్రం పండగ జరుపుకోవడం ప్రజలు సోదర భావాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భర్త సోనేరావు కుమారుడు సాయినాథ్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పెంచికల్‌పేట్ మండలానికి చెందిన రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ షంషీర్ అహ్మద్ మంగళవారం బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు ఇతనికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో కేంద్ర పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పెంచికల్‌పేట్ పార్టీ మండల అధ్యక్షులు జునుగరి మధూకర్, నాయకులు బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-బోథ్



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలక రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం ఇప్పుడు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం రైతులకు అన్నివిధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మెడిచేల్మ ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

వర్ష కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై మంగళవారం గాదిగూడ మండలంలోని ఝరి గ్రామంలో గ్రామస్తులకు హెచ్‌ఈఓ రాథోడ్ రవీందర్ అవగాహన కల్పించారు. వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి ముందు మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల వల్ల వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు.



అంగన్‌వాడీలలో మౌలిక వసతులు ఉండాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ భద్రత గల వాతావరణంలో సేవలు అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం మండలంలోని మోతుగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం, ఆర్ఆర్ కాలనీ, అప్పపల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి మౌలిక సదుపాయాలు, అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అనుకూలతలను పరిశీలించడం జరిగిందని, అవసరమైన మరమ్మత్తులు, మూత్రశాలల ఏర్పాటు, పెయింటింగ్, ఆట వస్తువులను సమకూర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో భద్రత గల వాతావరణంలో సేవలు అందుతున్నాయని తెలిపారు. జిల్లాలో 11 అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి వినూత్నంగా ఆధునీకరించడం జరుగుతుందని, 250 కేంద్రాలలో మూత్రశాలలు, 60 కేంద్రాలలో నీటి కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు సమయానుకూలంగా పౌష్టిక ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్, జిల్లా స్వయం సహాయక సంఘాల ఏపీడీ రామకృష్ణ, ఆసిఫాబాద్ శిశు అభివృద్ధి అధికారి సాదియా, అసిస్టెంట్ ఇంజనీర్ శశిధర్ పాల్గొన్నారు.

పాఠశాలలో గొడవలు పునరావృతమైతే చర్యలు

- జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని సాలెగూడ పాఠశాలలో సోమవారం జరిగిన సంఘటన నేపథ్యంలో జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు, మండల విద్యాధికారి మన కుమార్‌తో కలిసి మంగళవారం విచారణ జరిపారు. పాఠశాలలో ఇటువంటి గొడవ పడే సంఘటనలు మరోసారి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందు ప్రధానోపాధ్యాయుడు అనంతరావు, ఇన్‌చార్జీ హెచ్‌ఎం తిరుపతిలను వేరువేరుగా జరిగిన సంఘటనపై విచారించారు. విచారణకు ఉన్నతాధికారులు వచ్చారని తెలియడంతో అక్కడికి వచ్చిన గ్రామస్తులు వారితో గొడవకు దిగారు. అధికారులు గ్రామస్తులకు సర్ది చెప్పడంతో పాటు మరోసారి ఇటువంటి గొడవలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని మరికొంతమందితో మొబైల్ ద్వారా మాట్లాడి సమస్య పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామస్తులతో కలిసి పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనాన్ని సరైన విధంగా అందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో 'ఆపరేషన్ చభూత్ర'

- అర్ధరాత్రి తిరిగే ఆకతాయిలపై కఠిన చర్యలు
- మంచిర్యాల డీసీపీ భాస్కర్

నవతెలంగాణ-మంచిర్యాల



అకారణంగా అర్ధరాత్రి పట్టణంలో తిరిగే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోబడతాయని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి మంచిర్యాల పట్టణంలో ఆపరేషన్ ఛభుత్రలో భాగంగా ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సీలాల్‌తో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి రోజు రాత్రి పట్టణంలో స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని రాత్రి మద్యం సేవించి వాహనాలపై తిరుగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేసి పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సోమవారం రాత్రి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టణంలో తిరుగుతున్న యువకులను అదుపులోకి తీసుకొని 54 ద్విచక్ర వాహనాలపై, 5 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న యువకులకు మంచిర్యాల డీసీపీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి రోజు రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు పట్టణంలోని ప్రధాన చౌరస్తాలలో స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, తల్లి తండ్రులు పిల్లల నడవడికను అనునిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. అదుపులోకి తీసుకున్న వాహనాలను మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మహేందర్, ప్రశాంత్, సనత్, సురేష్, సుగుణకర్ పాల్గొన్నారు.

రేపే వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

- ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస ప్రత్యేక సమావేశ నిర్వహణ గడువు సమీపించడంతో అధికారులు నిర్వహణ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఆదిలాబాద్ ఆర్డీఓ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాస ప్రత్యేక సమావేశం ఈ నెల 18న ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరుగనుంది. దీంతో మంగళవారం ఆయన తొలిసారిగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. అవిశ్వాస సమావేశం నిర్వహణ, మున్సిపల్ చట్టం నిబంధనలపై కమీషనర్ ఖమర్ అహ్మద్‌తో చర్చించారు. ఈ ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు వీలుగా అనుసారించాల్సిన భద్రత చర్యలపై డీఎస్పీ జీవన్‌రెడ్డి, కమీషనర్‌తో చర్చించారు. అవిశ్వాస తీర్మాణ సమావేశం రోజున కౌన్సిల్ సభ్యుల వాహనాలు, సెల్‌ఫోన్లను కార్యాలయంలోకి అనుమతించవద్దని వారికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా తగు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ సూచించారు. ఆయన వెంట వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ ఉన్నారు.

గ్రామగ్రామాన మొహరం సందడి

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంతో పాటు భీంపూర్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో మొహరం పండుగను పురస్కరించుకొని మొహరం సందడి కొనసాగుతుంది. బంగ్లాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఉదయం డప్పు చప్పులతో సవార్లను ఆడించారు. తాంసి మండల కేంద్రంలోని కుర్లి, బుడన్ సవారి రాజేశ్వర సవారి, పెద్ద సవారి ఉదయం 3 గంటల లేపి ఎగిరించారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తిలకించి తమ మొక్కులను తీర్చుకున్నారు. మరో రెండు రోజుల్లో మొహరం పండుగ ముగుస్తుంది.

స్వర్ణ ప్రాజెక్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖాధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణ ప్రస్తుత నీటిమట్టం 1183 అడుగులకు గాను 1171.4 అడుగులు ఉంది. పరివాహక ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా పడే అవకాశం ఉన్నందున రాత్రికి స్వర్ణ ప్రాజెక్టు గేట్ల నుంచి వరద నీటిని వదిలే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు నది వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

యువ కవికి తెలంగాణ సారస్వత పరిషత్తు యువ పురస్కారం

నవతెలంగాణ-నిర్మల్



జిల్లాకు చెందిన ప్రముఖ యువ కవి, కళాకారుడు పోలీస్ భీమేశ్‌కు హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజరావు కళామందిరం అబిడ్స్‌లో తెలంగాణ పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రదాన కార్యదర్శి డా.జె చెన్నయ్య, భీమేశ్ తొలి కవితా సంపుటి 'స్వేచ్ఛకు సంకెళ్ళు' కు యువ పురస్కారం సోమవారం రాత్రి ప్రదానం చేశారు. భీమేశ్‌కు సన్మానం జ్ఞాపికతో పాటు రూ.10వేల నగదు బహుమతి సారస్వత పరిషత్తు అందించింది. రాష్ట్ర స్థాయిలో అర్హత పొందినందున నాకు మరింత బాధ్యత పెరిగిందని భీమేశ్ ఈ మేరకు పేర్కొన్నారు. భీమేశ్‌కు యువ పురస్కారం రావడంతో నిర్మల్ జిల్లాకు గర్వకారణమని జిల్లా కవులు, రచయితలు కళాకారులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- అడ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కొద్ది రోజులుగా ముఖం చాటేసిన వర్షాలు జిల్లాలో మంగళవారం విస్తారంగా వర్షం కురిసింది. జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. అడ ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు నమోదు కావడంతో సోమవారం రాత్రి జిల్లాలోని అడ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి అధికారులు నీటిని కిందికి వదులుతున్నారు. వీటిలో 4, 5 గేట్లు 0.15 మీటర్ మేర ఎత్తి 652 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా ఆదివారం ఉదయం నాటికి 237.900 మీటర్లకు చేరుకొంది. ప్రాజెక్టు సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ఇప్పటివరకు 5.963 టీఎంసీలకు చేరుకుంది. ఇన్ ఫ్లో 642 క్యూసెక్కులుగా ఉంది. దీనితో రెండు గేట్లు ఎత్తి 652 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు కింద ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

26 టన్నుల బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

26టన్నుల బియ్యాన్ని పట్టుకున్నట్లు మావల ఏఎస్సై జుల్ఫేర్‌కర్ సలీం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మావల 44వ జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వెళుతున్న లారీ నెం. ఆర్‌జే 11జీజీ 3373 తరలిస్తున్నట్టు సమాచారం మేరకు తనిఖీ చేసినట్టు తెలిపారు. 26 టన్నుల బియ్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని అరుణోదయ ఉన్నత పాఠశాలలో మంగళవారం కాగజ్‌నగర్ డివిజన్ షీటీం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు గురైతే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అత్యవసర సమయాలలో డయల్ 100కు కాల్ చేయాలని, షీటీం కాగజ్‌నగర్ డివిజన్ సెల్ నెం. 8712670565కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో పాటు షీ టీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మొహరం పండుగ వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంతో పాటు మండలంలోని హస్నాపూర్, గ్రామాల్లో మొహరం పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. మంగళవారం పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొహరం ఉత్సవాలు ఈనెల 18 వరకు కొనసాగుతాయని మర్సకోల దేవు తెలిపారు. ఈ వేడకల్లో మరాప కోసు, పెందూర్ ఆనందరావు, పంద్రం మాణిక్ రావు, మర్సకోల నగేష్, మర్సకోల మహదు, సోయం చందు, ఎస్‌కే జాకు, మేస్రం భీంరావ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుపౌర్ణిమ కరపత్రాలు విడుదల



నవతెలంగాణ-నార్నూర్

యువత్మాల్ జిల్లా కాసోలాలో మాతంగ్ ఋషి సంస్కార కేంద్రం సద్గురు గజానంద్ మౌళ్లి మహరాజ్ పుణ్య క్షేత్రంలో జరిగే గురు పౌర్ణమి కరపత్రాలను మంగళవారం మండలంలోని ఖంపూర్ గ్రామంలో దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా భక్తులకు ఉచిత రక్త పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైతే కంటి ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. గురు పౌర్ణమిని రాష్ట్ర జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో గ్రామ పెద్దలు బాబు, అంబాదాస్, రోహిదాస్, లాల్ శావ్, వామన్, శాంతాబాయి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్



సోన్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ రామలక్ష్మన్ తండ్రి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో నిర్మల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎంబరి గంగాధర్, సామాజిక కార్యకర్త శంకర్, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.